www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 5 జనవరి 2025

5

చిత్తూరు

కొనసాగుతున్న సిఎం పర్యటన ఏర్పాట్లు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఏర్పాట్ల నిమిత్తం శనివారం కుప్పం మండలం కంగుంది, ఎన్‌టిఆర్ స్టేడియంలో పటిష్ట భద్రత చర్యలపై స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు, రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్. మునిరత్నం పర్యవేక్షించారు. పటిష్టమైన బ్యారికేడింగ్ వ్యవస్థ, క్రౌడ్ మేనేజ్మెంట్, రూట్ మ్యాప్ సంబంధిత అంశాల ఏర్పాట్లు వంటివి త్వరితగతిన పూర్తి చేయాలని, అధికారులంతా ప్రోటోకాల్ ప్రకారం నడుచుకోవాలని సూచించారు. నిత్యం అప్రమత్తంగా ఉంటూ వారికి కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ అడిషనల్ ఎస్పీ ఎస్‌వి.రమణ, జిల్లా అడిషనల్ ఎస్‌పి రాజశేఖర్ బాబు, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

సిఎం పర్యటనను విజయవంతం చేయండి

శాంతిపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనకు సంబంధించి స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ మండలంలోని శివపురం గ్రామం వద్ద తన సొంత ఇంటి నిర్మాణ పనులను ఈనెల 7న సిఎం పరిశీలిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను ఎలాంటి లోటు పాట్లు లేకుండా విజయవంతం చేయాలని కోరారు. సిఎంకు మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఘన స్వాగతం పలకాలని కోరారు. కార్యదర్శి పివి.నాగరాజు, గుంజార్లపల్లి సర్పంచ్ విజయ రామిరెడ్డి, చంద్రశేఖర్, రుద్రప్ప, రమేష్, ఆంజనేయరెడ్డి, కేదార్నాథ్, మునిరెడ్డి, గజేంద్రరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

విమర్శలే.. అభివృద్ధి పనులేవీ..

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలు వివిధశాఖల అభివృద్ధి నివేదికలకే సమయం సరిపోతోందని విమర్శలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 32 మండలాల అభివృద్ధిపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో చర్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లోని లోపాలను సవరించుకొని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవాలి. పార్లమెంట్ సభ్యులు, ఎంఎల్‌సీలు, శాసన సభ్యులు, కార్పొరేషన్ల ఛైర్మెన్‌లు, జెడ్పిటీలు, ఎంపిపీలు జిల్లా పరిషత్ సమావేశాల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో ప్రజాసమస్యలను చర్చించాలి. అధికార పార్టీ అమలు చేస్తున్న పథకాల్లో లోపాలను ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు సమావేశాల్లో వెలుగులోకి తీసుకొచ్చి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలి.

చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిషత్‌లోని దాదాపు అన్ని జెడ్పిటీసీ స్థానాల్లో వైసిపి సభ్యులు ఉన్నారు. నాలుగైదు మినహా ఎంపిపిలు వైసిపి అభ్యర్థులే. ఇక శాసన సభ్యుల విషయాన్ని వస్తే పుంగనూరు, తంబళ్ళపల్లి, తిరుపతి ఎంపి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్‌సీ వైసిపి అభ్యర్థులున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మొదటి జిల్లా పరిషత్ సమావేశానికి వైసిపి నుండి పార్లమెంట్, శాసన సభ్యులు హాజరు కాలేదు. అధికార కూటమి ప్రజాప్రతినిధులు తామే సర్వం అన్నట్లుగా సమావేశం సాగింది. గత నెల డిసెంబర్ 31వ తేదీ నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి తిరుపతి ఎంపి గురుమూర్తి, తంబళ్ళపల్లి శాసన సభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డిలు అధికారపార్టీ ఆగడాలను ఎదుర్కొంటాని హెచ్చరించారు. ప్రోటోకాల్ పాటించడం లేదని వైసిపి ప్రజా ప్రతినిధులను స్థానికంగా అధికారికంగా నిర్వహిస్తున్న సమావేశాలు ఆహ్వానించడం లేదంటూ అధికారుల తీరుపై మండపడ్డారు. శ్రీకాళహస్తి, సత్యవేడు, తిరుపతి నియోజవర్గాలో ప్రభుత్వ పాఠశాల నిర్వహణ దయనీయంగా ఉందని, బిఎన్ కండ్రిగలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురికావడంపై ఎలాంటి చర్యలు తీసుకోలేని స్థానిక సంస్థ ప్రజాప్రతినిధులను నిర్లక్ష్యం చేసేలా అధికార పార్టీ వ్యవహరించడాన్ని వైసిపి ప్రజాప్రతినిధులు ఆగ్రహిస్తున్నారు.

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అధికారులపై విమర్శలకు గుప్పిస్తున్నారు. గత ప్రభుత్వంలో నాటి ప్రజా ప్రతినిధులకు తొత్తులుగా వ్యవహరించారంటూ అధికారులను టార్గెట్ చేస్తూ మాట్లాడుతున్నారు. ప్రజాసమస్యలను చర్చించి జిల్లా అభివృద్ధి కోసం నిధుల కేటాయింపు కోసం పట్టుబడ్డి తీర్మాణాలు చేయాల్సిన జెడ్పి సర్వసభ్య సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలపై వ్యక్తిగత ఆరోపణలు, అజెండాల ఉపన్యాలకు పరిమితం కాకుండా అభివృద్ధికి వైపుగా పయణిస్తున్న చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఇందు కోసం అవసరమైన నిధులు కేటాయింపు కోసం కృషి చేసి జిల్లా రైతాగం ఎదుర్కొంటున్న పంటనష్టం భీమా, పెట్టుబడి సాయం, మామిడి గిట్టుబాటు ధర, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు, ఉద్యాన పంటకు సాయం, తాగునీటి సమస్య, సీసీ రోడ్ల నిర్మాణం, సురక్షిత మంచినీరు, పరిశ్రమల ఏర్పాటు, భూ సమస్యల పరిష్కారం వంటి వాటిపై అర్ధవంత చర్చ జరగాలని జిల్లా ప్రజానీకం కోరుతోంది.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇంటర్ విద్యార్థులు ఆరోగ్యవంతమైన విద్యాభ్యాసం సాగించాలనే ఉద్దేశంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచన ఫలితంగానే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంను శనివారం చిత్తూరు రూరల్ మండలం బిఎన్‌ఆర్ పేట జూనియర్ కళాశాల, చిత్తూరు పీసీఆర్ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. బీఎన్‌ఆర్ పేట కళాశాలలో జరిగిన కార్యక్రమంలో స్థలదాత చంద్రప్రకాష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ధనుంజయ, పీసీఆర్ జూనియర్ కళాశాలలో మేయర్ ఎస్.అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, డీవైఈవో సయ్యద్ మౌలానా, ప్రిన్సిపల్ షేక్ అబ్దుల్ మజీబ్ పాల్గొన్నారు.

డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిని వరలక్ష్మి కోరారు. శనివారం కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ప్లెస్‌టూ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుప్పం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఒకేషనల్ కళాశాలలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆపథకాన్ని తీసుకు వచ్చినట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

యాదమరి: స్థానిక పీఎం జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ రేవతి ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారులు రుక్మిణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ పురం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని శనివారం మండలంలోని కొత్తపల్లి మిట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రధానోపాధ్యాయురాలు శాంతి ప్రారంభించారు.

వెదురుకుప్పం: శనివారం చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం పథకాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వీఎం థామస్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కళాశాలలో 236 మంది విద్యను అభ్యసిస్తున్నారని వీరికి మంచి పౌష్టిక ఆహారంతో కూడిన భోజనాన్ని అందిస్తారని తెలిపారు.

పూతలపట్టు: రాష్ట్ర విద్యారంగా అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమ వంతు కృషి చేస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ అన్నారు. శనివారం పూతలపట్టు జూనియర్ కళాశాలలో ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయనే స్వయంగా విద్యార్థులకు భోజనాలు వడ్డించారు.

పలమనేరు: స్థానిక టీకేసి జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యతో మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులు టెక్నికల్ కోర్సులపై దృష్టి సారించాలన్నారు. ఎంఈవో లీలారాణి, కళాశాల ప్రిన్సిపాల్ కన్నయ్య శెట్టి, అధ్యాపకులు శ్రీనివాసులు, సుధారాణి పాల్గొన్నారు.



పలమనేరులో..

కార్వేటినగరం : ప్రభుత్వ విప్ శాసనసభ్యులు డాక్టర్ వి.ఎం థామస్ శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే, ప్రిన్సిపాల్ స్వరూప, ఎంఈఓ విజయ్ కుమార్ విద్యార్థులతో కలిసి సహపంతి భోజనం చేశారు. అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, జీడినెల్లు జనసేన ఇంచార్జ్ పొన్న యుగంధర్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రరెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, ఎంఈఓ మనోజ్ కుమార్, ఏపీఎం కవిత పాల్గొన్నారు.

కుప్పంలో..

కార్వేటినగరంలో..

సోమల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు శనివారం కూటమి నేతలు కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కళాశాలలో ఏర్పాటు చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమని కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు అన్నారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసులు నాయుడు, జనసేన మండల అధ్యక్షులు నాగభూషణం రాయల్ పాల్గొన్నారు.

శాంతిపురం: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. విద్యార్థులందరూ బాగా చదివి మంచి వృద్ధిలోకి రావాలని తెలియజేశారు. మండల అధ్యక్షులు విశ్వనాథ్ నాయుడు, కార్యదర్శి పివి నాగరాజు, క్లస్టర్ ఇంచార్జ్ ఆర్‌ఎస్.మని, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సబ్జాన్ సాబ్, జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వందన త్రిపాఠి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభించారు. ఎంఈఓలు నాగేశ్వరరావు, రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర, అధ్యాపకులు గిరిబాబు, రేవతి, మురళి, చంద్రమోహన్ రెడ్డి, హసీనా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: పులిచెర్ల మండలంలోని నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఎంపీడీవో రాజశేఖర్ ప్రారంభించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటారని తెలియజేశారు. ఎంఈఓలు సి.సిద్ధరామయ్య, పి.తాతయ్య, కళాశాల ప్రిన్సిపల్ తులసీరామ్, నాయకులు రామనాథం నాయుడు, గోపి నాయుడు, శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

విజయపురం (నగరి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆర్డీవో భవానీ శంకరి శనివారం ప్రారంభించి విద్యార్థులకు ఆమె స్వయంగా భోజనం వడ్డించారు. ప్రిన్సిపాల్ వెంకటాచలపతి, ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, ఎండీఎం ఇన్‌చార్జి జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

రామకుప్పం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం టిడిపి నేతలు ప్రారంభించారు. మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, నేతలు ఆంజనేయ రెడ్డి, కృష్ణ నాయక్, సలాంసాబ్, మనోహర్, విజయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

'అమృత్ 2.0'ను ప్రారంభించిన ఎమ్మెల్సీ

అమృత్ 2.0 పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: అమృత్ 2.0 పథకంతో కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందని తెలుగుదేశం పార్టీ కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ స్పష్టం చేశారు. శనివారం పట్టణ పరిధిలోని డీకేపల్లి వద్ద అమృత్ 2.0 పథకాన్ని పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం పట్టణంలో తాగునీరు, మురుగునీటి వ్యవస్థలను మరింత మెరుగుపరిచేందుకు అమృత్ 2.0 పథకం ద్వారా రూ.9.21 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కుప్పం పట్టణానికి మంచినీటి సరఫరా, కుళాయి కనెక్షన్లు ఇవ్వడం, పైపులైన్లు విస్తరణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. డీకే పల్లిలో 5 ఎం.ఎల్.డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కుప్పం ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందజేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

విద్యుత్ బిల్లులు

ఇకపై క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు

ట్రాన్స్కో ఏఈ మహేందర్ రెడ్డి

విద్యుత్ బిల్లుతోపాటు వచ్చిన క్యూఆర్ కోడ్ చూపుతున్న ఏఈ

ప్రజాశక్తి- సోమల: విద్యుత్ వినియోగదారులు ఇకపై తమ విద్యుత్ వినియోగ చెల్లింపు బిల్లులో ఉండే క్యూఆర్ కోడ్ ద్వారా బిల్లులు సులభతరంగా చెల్లించవచ్చునని సోమల ట్రాన్స్కో ఏఈ మహేందర్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఫోన్ పే, గూగుల్ పే, ఇతర యూపీఐ ద్వారా వినియోగదారులు విద్యుత్ బిల్లులను చెల్లించే వారిని, ఆ తరువాత కొద్ది నెలలుగా విద్యుత్ శాఖ తీసుకున్న నిర్ణయం కారణంగా ప్రత్యేక యాప్ ద్వారా బిల్లుల చెల్లింపులు జరుగుతూ వచ్చాయని తెలిపారు. జనవరి నుండి విద్యుత్ వినియోగదారులకు ఇచ్చే బిల్లులోనే క్యూఆర్ కోడ్ ఉంటుందని దానిని స్కాన్ చేసి ఫోన్ పే, గూగుల్ పే పేటీఎం, ఇతర యూపీఐ యాప్ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చునని ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డొమెస్టిక్, గృహ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్టీ, ఎస్సీ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా..

ఎమ్మెల్యే మురళీమోహన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి- యాదమరి: పూతలపట్టు నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పూతలపట్టు నియోజకవర్గం స్థాయి ఎస్సీ, ఎస్టీల గ్రామస్థాయి నాయకులు, ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికీ చాలా ఎస్సీ, ఎస్టీ కాలనీలో మౌలిక వసతులు, ఇంటి స్థలాలు, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లులేని గ్రామాల్లో ప్రత్యేక నిధులతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను జిల్లాస్థాయి అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకచర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే ఎస్సీ కాలనీలో 10.16 కోట్ల రూపాయల నిధులతో రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే నియోజవర్గంలోని ఐదు మండలాల్లో గోకులం షెడ్లు మంజూరులో 40 శాతానికి పైగా ఎస్సీ ఎస్టీలకు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, వారి అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. అర్హులైన పేదవారికి ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరయ్యే విధంగా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అభివృద్ధి విషయంలో నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. దళిత గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి గ్రామాల్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. నాయకులు జయప్రకాష్ నాయుడు, దొరబాబు చౌదరి, గిరిధర్ నాయుడు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మహిళలకు, పిల్లలకు రక్షణ కల్పించాలి
సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్
తడుకు పేటలో నాలుగు పోలీస్ పికెటింగ్‌లు
ఇరువైపుల నుంచి కేసులు రిజిస్టరు చేశాం: సీఐ

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

మండలంలోని తడుకుపేటలో దళితులపై దాడి, వేధింపులపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. శనివారం తడుకు దళితవాడకు వెళ్లి బాధితులను పరామర్శించిన అంబేద్కర్ యువజన సంఘం వివరాలు ఆరా తీసిన వారు దళితులపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. సీపీఎం నాయకులు దళితులపై దాడిని ఖండిస్తూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అగ్రకులస్తులపై చర్యలు తీసుకొని దళితులకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలో ఉందని అధికార పార్టీ నాయకులు దళితులు గ్రామం వదిలి వెళ్ళిపోవాలని ఆంక్షలు విధించడం ఏమిటని ప్రశ్నించారు. గొడవలు సద్దుమణిగినా రకరకాల పద్ధతుల్లో రాజకీయకక్షలతో దళితులను బలి చేయవద్దన్నారు. దళితులు పిల్లలు స్కూలుకు రాకూడదని బయట పంపడం, గుడిలోకి రాకూడదనడం దుర్మార్గం అన్నారు. మహిళలకు రక్షణ లేకుండా ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందన్నారు. రాజ్యాంగం ప్రకారం అందరూ సమానమైనప్పటికీ కులాలను తీసుకురావడం సరికాదన్నారు. దెబ్బలు తగిలి ఆసుపత్రిలో ఉన్నవారు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సమస్యగా చూడాలి తప్ప దానిని వివక్ష రూపంలో చేయడం దారుణమన్నారు. రాజకీయాలకు అతీతంగా దళితులకు మహిళలకు రక్షణ కల్పించే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారంలో ఎవరు ఉన్నప్పటికీ ప్రజానుకూలంగా ఉండాలంటే తప్ప దానికి విరుద్ధంగా ఉండకూడదన్నారు. మహిళలకు పిల్లలకు రక్షణ కల్పించాలని కోరారు. నగరి సిపిఎం కార్యదర్శి పెరుమాళ్, తంగరాజు, సందీప్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయి: సీఐ

తడుకు గ్రామం, దళితవాడలో పరిస్థితి అదుపులోకి వచ్చిందని, లా అండ్ ఆర్డర్ కంట్రోల్‌లో ఉందని సీఐ మహేశ్వర్ తెలిపారు. 4 పోలీస్ పికెటింగ్‌లు ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ, డీఎస్పీలు ఎప్పటికప్పుడు ఇక్కడ జరిగే పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. రెండు వర్గాల వారిపైనా కేసులు నమోదు చేశామన్నారు. ఎవరు ఇన్వాల్వ్ అయ్యారో వారిని రిమాండ్ చేస్తామని, ప్రశాంతతకు భంగం కలిగించేలా ఎవరూ ప్రవర్తించవద్దన్నారు. ఎవరూ ఆవేశాలకు లోనుకావద్దన్నారు.

టీడీపీ నేతల ప్రవర్తన అమానవీయం

మాజీ మంత్రి ఆర్కేరోజా

దళితులపట్ల టీడీపీ నేతల ప్రవర్తన అమానవీయమని మాజీ మంత్రి, రాష్ట్ర వైసిపి అధికార ప్రతినిధి ఆర్కే రోజా అన్నారు. మండలంలోని తడుకుపేటలో దళితులపట్ల టీడీపీ నేతలు దాడి చేయడంపై ఆమె ఈ మేరకు స్పందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరుగుతున్నాయని ఆరోపించారు. గత వారం రోజులుగా వారిని ఇబ్బంది పెడుతూనే ఉన్నారన్నారు. దళితులు ఊర్లోనే ఉండకూడదని టీడీపీకి చెందిన ఒక మహిళ నడిరోడ్డుపై చెబుతోందంటే ఇంతకన్నా దుస్సంఘటన మరొకటి లేదన్నారు. దళితుల బైక్‌లు కాల్చేశారని, వారిని కొట్టి గాయపరిచారని అందులో విక్కీ అనే అతనికి కంటికి గాయమై లోపల రక్తం గడ్డకట్టి కంటిచూపు విషమంగా మారిందన్నారు. ఊర్లో వెళ్లేందుకు బయపడుతున్నాం అని దళితులు చెబుతున్నారంటే మనం ఏ కాలంలో ఉన్నామన్నారు. చంద్రబాబు పాలన వస్తే దళితులపై దాడులు పెరుగుతుందన్నారు. కారంచేడు, చుండూరులా నగరిలోను దళితులు బాధింపుకు గురయ్యారన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని వారిపై అక్రమకేసులు పెడుతున్నారన్నారు.

పోలీసుల స్టేషన్ ఎదుట దళితులకు అండగా సిపిఎం నాయకులు

అగ్రవర్ణాల దాడిలో గాయపడిన దళితుడు, అగ్రవర్ణాల వారు తగలబెట్టిన దళితుల బైక్

చెరువును పూడ్చేస్తున్నారు

తహశీల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

చెరువును పరిశీలిస్తున్న తహశీల్దార్ పార్థసారథి

ప్రజాశక్తి- యాదమరి: మండలంలోని బండివాండ్ల చెరువును పూడ్చి వేస్తున్నారని తహశీల్దార్ పార్థసారధికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. శనివారం బండివాండ్ల ఊరు గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. బండివాండ్ల ఊరు చెరువు మీదుగా చెన్నై – బెంగళూరు జాతీయ రహదారి సిక్స్ లైన్స్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు సమీపంలోని వ్యర్థాలైన రాళ్లు, మట్టిని బండి వాండ్ల ఊరు చెరువులో తోలి చెరువును పూడ్చి వేస్తున్నారని గ్రామస్తులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. చెరువుకు నీరు వచ్చే సప్లై ఛానల్ కాలువలను సైతం పూడ్చివేశారని తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు చెరువును తహశీల్దార్ పరిశీలించారు. చెరువులో వేసిన వ్యర్థాలను రాళ్ళు, మట్టిని తొలగించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి- పూతలపట్టు: నేడు ప్రతి మహిళా ఆనందంగా ఉందంటే డ్వాక్రా సంఘాల సృష్టికర్త రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే అని, మహిళలు తమ ఆనందాలను ముఖ్యమంత్రికి తెలియజేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ అన్నారు. శనివారం పూతలపట్టు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో డ్వాక్రా సంఘాల మహిళలకు పలు చెక్కులు ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పూతలపట్టు మండలంలో 94 సంఘాలకు రూ.15 కోట్ల 70 లక్షలు, 390 మంది మహిళలకు శ్రీనిధి ద్వారా రూ.4.60 లక్షలకు సంబంధించి చెక్కులు పంపిణీ చేశారు. నేడు ప్రతి మహిళ తమ కుటుంబ అభివృద్ధితోపాటు ఆర్థికంగా పునరాభివృద్ధి చెందడానికి డ్వాక్రా సంఘాలే ముఖ్య కారణమన్నారు. ఇటీవలే పూతలపట్టు, బంగారుపాల్యం, మండలాల్లోని కొన్ని సంఘాలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందడాన్ని గుర్తు చేశారు. ఇదే తరహాలో ప్రతి సంఘం అభివృద్ధి చెందాలని ప్రతి మహిళ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. డీసీఎం హరికృష్ణ రెడ్డి, శ్రీనిధి జిల్లా మేనేజర్ ప్రకాష్, టిడిపి మండల కన్వీనర్ దొరబాబు, చిత్తూరు పార్లమెంటు జిల్లా కార్యదర్శి గోపి, మాజీ మండల కన్వీనర్ చంద్రమౌళి, ఎంపీపీ కుమారి, జడ్పిటిసి దేవిక, ఏపీ ఎం.సింగన్న పాల్గొన్నారు.

యుటిఎఫ్ మహాసభలకు తరలిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఈ నెల 5,6,7,8 తేదీలలో కాకినాడలో జరగనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు శనివారం మండలంలో ఉపాధ్యాయులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా యూటీఫ్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యారంగాన్ని సంరక్షించుకోవడం, ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిస్కారం, జీవో నెంబర్ 117ను రద్దు, విద్యేతర కార్యక్రమాల యాప్స్ రద్దు, ఓపిఎస్, నూతన పిఆర్సి అమలు, రావాల్సిన బకాయిల, సమాంతర మాధ్యమంలో బోధన, మొదలగు సమస్యలపై తీర్మానాలు చేసి ప్రభుత్వానికి తెలియజేస్తూ 50 వసంతాల యుటిఎఫ్ ప్రస్థానం భవిష్యత్తు కార్యక్రమాలపై ఈ మహాసభలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. నాయకులు శ్రీనివాసులు, శంకర్రెడ్డి, వెంకటేష్, బాలాజీ, యుగంధర్ ఉన్నారు.

బాల్య వివాహాలపై వ్యాసరచన పోటీలు

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఆదినారాయణ

ప్రజాశక్తి- పలమనేరు: జిల్లా కోర్టు ఆదేశాల మేరకు పలమనేరు పట్టణంలోని పాలిటెక్నిక్ కాలేజ్‌లో బాల్యవివాహాలు పైన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పిల్లలకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. మండల న్యాయసేవా అధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఆదినారాయణ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్యవివాహాలు మహిళల వృద్ధికి ఆటంకంగా మారుతాయని అన్నారు. ప్రాథమిక హక్కులు, విధులు గురించి వివరించారు. అనంతరం ప్రభుత్వ అంబేద్కర్ వెల్ఫేర్ హాస్టల్‌లోని వంటగదిని, వసతి గృహాలను తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న భోజనం, వసతి గురించి ఆరా తీశారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించడంతోపాటు మంచి చదువును అందించాలని సూచించారు. న్యాయవాదులు అరిఫుల్లఖాన్, ఎపిపి రంజిత్ షా, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహమద్ పాల్గొన్నారు.

తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడం పట్ల హర్షం

ప్రజాశక్తి- గంగవరం: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉత్తర్వులను ఆంగ్లంతో పాటు తెలుగులోనూ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడం పట్ల తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు పి.తులసినాథం నాయుడు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాధాన్యత కల్పించడం, అన్ని యాజమాన్య పాఠశాలల్లోనూ పాఠశాల స్థాయిలో మాతృభాషా మాధ్యమంలోనే బోధన జరిగేలా చర్యలు తీసుకోవడం లాంటి చర్యలతో తెలుగు భాషకు మరింత వెలుగులు తీసుకురావాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అరుణకుమార్ ఆదేశాల మేరకు కమ్మనపల్లిలోని శనివారం ఏపిఆర్ఎస్ స్కూల్‌లోని విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు చేయడం జరిగిందని హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వైద్యపరీక్షలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్ వాష్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోషక విలువలతో కూడిన ఆహారం గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇఆర్. శోభ, సిహెచ్ఓ సాయిదివ్య, రేవతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేంద్రియానం నయనం ప్రధానం

ఘనంగా ప్రపంచ అంధుల దినోత్సవం

బంగారుపాళ్యంలో..

ప్రజాశక్తి -సోమల: ప్రపంచ అంధుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన సోమలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కంటి ప్రాధాన్యత తీసుకోవలసిన జాగ్రత్తలు పోషక పదార్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈఓ శివరత్నమ్మ మాట్లాడుతూ కంటి చూపు లేకుండా ప్రపంచాన్ని చూడలేమని ఏమీ సాధించలేమని కావున ప్రతి ఒక్కరూ కంటి సంరక్షణకు కంటిచూపు బాగా ఉండేందుకు పౌష్టికాహారాలను తీసుకోవాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య మాట్లాడుతూ అంధుల సమస్యను గుర్తించిన బ్రెయిలీ వారికోసం ప్రత్యేకంగా లిపిని తయారు చేసి వారు వాటిని చదివి ప్రపంచ జ్ఞానాన్ని కంటిచూపు లేకుండానే గుర్తించే విధంగా వారికి అవకాశం కల్పించారని బ్రెయిలీ లిపి ద్వారా ఎంతోమంది ఉన్నత శిఖరాలకు చేరి సాధారణ మానవులతో పాటు వారు కూడా ఏ రంగంలోనూ తీసి పోరని రుజువు చేస్తున్నారని అన్నారు. ఐఆర్టి రవీంద్ర, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిపల్లిలో..

బంగారుపాళ్యం: వైకల్యం అభివృద్ధికి ఆటంకం కాదని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని భవిత భవనంలో లూయిస్ బ్రెలీ జన్మదిన వేడుకలు ఐఈఆర్ పిఎస్ ఉపాధ్యాయురాలు హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగవైకల్యంతో నిరుత్సాహ పడకూడదని ప్రయత్నిస్తే ప్రతి ఒక్కరు విజయాలు సాధిస్తారని ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించిన రేవతి లూయిస్ బ్రెయిన్ లిపి ద్వారా డిగ్రీ పూర్తి చేశారని అంగవైకల్యం గల పిల్లలను ప్రోత్సహించి విద్యలో ముందుండే విధంగా చూడాలన్నారు. భవిత విద్యార్థులకు సిఆర్‌పి సుశీల రూ.5వేలు ఆర్థిక సహాయం చేశారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు ధనంజయరాజు, అమ్ములు, ప్రత్యేక ఉపాధ్యాయులు భార్గవరావు, ఎస్ఎంసి ఛైర్మన్ నేత్ర, వైస్ ఛైర్మన్ మంజుల, ఉపాధ్యాయులు వీరయ్య పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం ఎంపీపీ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ కుమార్ లూయిస్ బ్రెయిలీ జీవిత చరిత్ర గురించి వివరించారు. ఫిజియోథెరపీ డాక్టర్ బి.నిరంజన్ మాట్లాడుతూ అంధులు ఆత్మన్యూనత భావాన్ని విడనాడి ముందుకు సాగాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఐఈ ఆర్పీలు అరుణ, చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

గుడిపాల: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో బ్రెయిలీ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు హసన్ బాషా, గణపతి మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే విజయాన్ని సాధించవచ్చన్నారు. దృఢ సంకల్పంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఖాతూన్ బీ, ఉపాధ్యాయులు వాణి, భబిత పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని భవిత కేంద్రంలో ప్రపంచ అంధుల దినోత్సవం సందర్భంగా ఎంఈఓలు డి.శ్రీనివాసులు, ఎన్.ఇందిర విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. లూయిస్ బ్రెయిలీ జన్మదినం సందర్భంగా 2024లో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విజయపురం (నగరి): అంధులపాలిట వెలుగురేఖ బ్రెయిలీ అని ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం అన్నారు. ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక భవిత కేంద్రంలో గుణశేఖర్ అనే దాత రూ.5 వేలు విలువ గల జారుడు బల్లను విరాళంగా అందించారు. ప్రధానోపాధ్యాయులు పార్వతీదేవి, మాజీ ఎంఈవో జయచంద్రారెడ్డి, ఐఈడీఎస్ఎస్‌లు పి.సంగీత, పి.భవాని, ఎం.సంతోష్ నాయక్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురంలో..

క్రైం న్యూస్

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మున్సిపల్ పరిధి సాళ్వపట్టెడలోని ఓరుగుంటాలమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ స్వీపరు ఉదయం ఆలయాన్ని శుభ్రపరచడానికి వచ్చిన సమయంలో ఆలయ తలుపులు పగలగొట్టి ఉండటం గమనించి ధర్మకర్త చిరంజీవిరెడ్డికి సమాచారం అందించింది. హుటాహుటిన అక్కడకు వెళ్లిన వారు ఆలయ ముఖద్వారం, ప్రధాన ద్వారం, గర్భగుడి, స్టోర్ రూమ్‌లకువేసిన తాళాలు పగలగొట్టి ఉండటం, హుండీని చిద్రం చేయడం, వస్తువులన్నీ చిందరవందరగా వేసి ఉండటం గమనించి పోలీసులకు ఫిర్యాదు అందించారు. ఆలయంలో ఇటీవల ఉత్సవాలకు హుండీలో పోగైన సొమ్ము రూ.30వేల దాకా ఉంటుందని, భక్తులు సమర్పించిన 8 గ్రాముల బంగారు తాళిబొట్టు, వెండి తట్ట చోరీకి గురైందని ఆలయ ధర్మకర్త తెలిపారు. రాత్రిపూట ఆకతాయిల సంచారం ఆలయ పరిధిలో ఎక్కువైందని ఆలయం సమీపానే మద్యం తాగడం, పేకాట ఆడటం చేస్తున్నారన్నారు. వారిపై అనుమానం వ్యక్తం చేశారు.

న్యాయం చేయండయ్యా..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అమరాజా బ్యాటరీస్ ఫ్యాక్టరీ యాజమాన్యం మాట ఇచ్చి ప్రస్తుతం ముఖం చాటేస్తోందని తమకు న్యాయం చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని యాదమరి మండలం మోర్దాన్‌పల్లికి చెందిన మృతుడి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అమరాజా బ్యాటరీస్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్న తమ కుమారుడు మునిష్ గతేడాది నవంబర్ 5వ తేదీ ఫ్యాక్టరీ ఆవరణంలో ద్విచక్రవాహనం నుండి కిందపడి తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందాడని నాడు కార్మికుడికి అందాల్సిన పూర్తి జీతం, ఫెన్షన్‌తో పాటు మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, కొడుకుని కొల్పాయిన తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆదుకోవాలంటూ కోరుతున్న మృతుని తల్లిదండ్రులు

పౌష్టికాహారం అందించాలి: ఎంపిడిఓ

ప్రజాశక్తి- పెద్దపంజాణి: రాయలపేట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపిడిఓ బాలాజీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 147 మంది విద్యార్థులకు గాను 142 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి, నాణ్యత గురించి పిల్లలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు తప్పకుండా పాటించాలని, వ్యక్తిగత పరిసర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎక్కడా అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సూచించారు. పంచాయతీ కార్యదర్శి రెడ్డిప్రకాష్, వెల్ఫేర్ అసిస్టెంట్ సోమశేఖర్, హెడ్మాస్టర్ ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపిడిఓ

గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం

డాక్టర్ అనిల్ కుమార్

ప్రజాశక్తి- యాదమరి

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం వారి గ్రామాల్లోనే అందించేందుకే 104 ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిదని వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ తెలిపారు. శనివారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో 104 సంచార వైద్యం వాహనంతో పాటు వైద్య సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యాధి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చిన్నచిన్న జబ్బులకు వారి గ్రామాల్లోనే వైద్యపరీక్షలు చేసి చికిత్సలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, హెల్త్ వర్కర్ సురేందర్ రెడ్డి, ఏఎన్ఎం, ఆశలు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కోడె దూడల కొనుగోలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ప్రెగ్నెన్సీ టెస్టింగ్ ప్రోగ్రాం ద్వారా ఎస్ఆర్ పురం మండలంలోని నెలవాయి గ్రామంలో కోడె దూడలను కొనుక్కున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వాసు తెలిపారు. జిల్లాలో మొత్తం 17 నిరూపితమైన కోడే దూడలను ప్రెగ్నెన్సీ టెస్టింగ్ ప్రోగ్రాం ద్వారా ఎంపిక చేసిన దానిలో భాగంగా మండలంలోని నెలవాయి గ్రామపంచాయతీ నెలవాయి గ్రామంలో నివసించు జయరాం కొడుకు రవి అను రైతు దగ్గర ఐదు నెలల రూ.18,360లకు కొనుక్కున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెగ్నెన్సీ టెస్టింగ్ ప్రోగ్రాం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వాసు, పర్యవేక్షణ అధికారి డాక్టర్ రామమేఘానంద రెడ్డి, ఎస్ఆర్ పురం పసువైద్యాధికారి శ్రీవిద్య, సూపర్వైజర్ సుధాకర్, గోపాలమిత్ర భూపతి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో

కమిటీలదే కీలక పాత్ర

ప్రజాశక్తి- పూతలపట్టు: పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల కమిటీ సభ్యులదే కీలక పాత్ర అని రాష్ట్ర అబ్జర్వర్ అన్నారు. శనివారం ఎం.బండపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆ పాఠశాల కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు కలిసికట్టుగా పాఠశాలలను అభివృద్ధి పథంలో నడపాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులకు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులకు పాఠశాల అభివృద్ధి విషయంలో వారి పాత్ర గురించి వివరించారు. ఆయన వెంట ఏసీఎంవో విజయలక్ష్మి ఉన్నారు.

జారుడు బండ వితరణ

ప్రజాశక్తి- పలమనేరు: స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలకు శ్రీపురం సీతారామయ్య నాగమణి చారిటబుల్ ట్రస్ట్, కొలమాసనపల్లి రత్న బయో లైఫ్ వారి భాగస్వామ్యంతో నూతనంగా నిర్మించిన జారుడు బండను శనివారం ప్రారంభించారు. శ్రీపురం సునీత మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు శారీరిక, మానసిక ఉల్లాసం కోసం అవసరమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్న శ్రీపురం సీతారామయ్య, వారి కుటుంబ సభ్యులను శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లంపల్లి నరేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

పాఠశాల కమిటీకి శిక్షణ

ప్రజాశక్తి- కుప్పంరూరల్: అడవి బూదుగూరు హరిజనవాడలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోతుగుంట చిట్టిబాబు శిక్షణా తరగతులు నిర్వహించారు. పాఠశాల యాజమాన్య కమిటీ, సభ్యుల భాధ్యతలు, వారి విధులు, పాఠశాల నిర్వహణలో వారి భాధ్యతలను వివరించారు. కమిటీ ఛైర్మన్ జగదీష్, వైస్ ఛైర్మన్ మునిలక్ష్మి, ఉపాధ్యాయులు నరేంద్ర బాబు పాల్గొన్నారు.

ఆయిల్ వేస్ట్‌ను తొలగించాలి..

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని పెద్దకాల్వ పంచాయతీ చెర్లోపల్లి దళితవాడ వద్ద ఉన్న కుషాల్ గ్రానైట్ ఫ్యాక్టరీని ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎంపిడిఓను అడ్డుకున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీ ఆయిల్ వేస్ట్ మెటీరియల్‌ను లారీల ద్వారా డంప్ చేయడాన్ని తప్పు పట్టారు. వెంటనే ప్రజలకు ఇబ్బంది కలగకుండా డంప్ చేసిన ఆయిల్ వేస్ట్ మెటీరియల్ వెంటనే తొలగించాలని సంబంధిత గ్రానైట్ యజమానిని ఆదేశించాలని కోరారు. ఎంపిడిఓ సెక్రెటరీ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేస్ట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీ విద్యార్థులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- యాదమరి: జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలలో పాల్గొనే విద్యార్థులకు ఉన్నత పాఠశాల 1990 సంవత్సరం పూర్వవిద్యార్థులు ఆర్ముగం, రమేష్, రాజశేఖర్ వారిబృందము ఆర్థికసాయం అందజేశారు. జాతీయ ఫెన్సింగ్ పోటీలు ఉత్తరాఖండ్‌లోని రుద్రపూరు ఢీల్లి పబ్లిక్ స్కూలీలో ఈనెల 8 నుండి 11వయ తేదీ వరకు జరుగు పోటీలకు ఎంపికైన జీవిత, మోనిష, ధరణిలకు రవాణ ఖర్చుల నిమిత్తం రూ.8వేలు ఆర్థిక సాయంగా అందించారు. అలాగే కె.రవీంద్ర మొదిలియార్ విద్యార్థినుల భోజన ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. విద్యార్థులకు సహాయం చేసిన వారికి పాఠశాల హెచ్ఎం గిరిరాజ, పిడిలు రవి, హరిక్రిష్ణ ధన్యవాదాలు తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. శనివారం ఉదయం చిత్తూరు నగరంలోని ఏపీడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు జిల్లా అడహాక్ కమిటీ సమావేశాన్ని ఫెడరేషన్ జిల్లా కో– కన్వీనర్లు జయప్రకాష్, నీరజాక్షులు (చిన్న) సీనియర్ జర్నలిస్ట్ సాటిగంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమం, అభివద్ధి, యూనియన్ బలోపేతం తదితర అంశాలను విస్తృతంగా చర్చించారు. అనంతరం సమావేశం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. ముఖ్యంగా సభ్యత్వ నమోదు, జిల్లా నూతన కార్యవర్గ కమిటీ ఎన్నికల నిర్వహణ, ఫిబ్రవరి 2వ తేదీన జిల్లా మహాసభల నిర్వహణ అంశాలపై ప్రధానంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం రాష్ట్ర కమిటీతో పాటు, జిల్లా అడహాక్ కమిటీ కన్వీనర్ కడియాల వరదరాజులు అనుమతితో జిల్లా యూనియన్ ఎన్నికల అధికారులుగా ఆంధ్రప్రభ బ్యూరో ఇంచార్జ్, సీనియర్ జర్నలిస్టు సాటిగంగాధర్, మరో సీనియర్ జర్నలిస్ట్, 10 టీవీ రిపోర్టర్ జయచంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారుల అనుమతితో విడుదల చేశారు. సమావేశంలో జర్నలిస్టులు జయరాజ్, జయచంద్ర, మురళీకష్ణ, ప్రజాశక్తి బాలసుబ్రమణ్యం, దాము, రాజేష్, సురేంద్రరెడ్డి, సికెఎన్ ప్రకాష్, కపానందరెడ్డి, సాక్షి మురళి, నాగరాజు, యాదవేంద్రరెడ్డి, సురేంద్రరెడ్డి, కుబేంద్రన్, దినేష్, ఉమాశంకర్, దాము, తులసిప్రసాద్ రెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఎపిజేడబ్ల్యూఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న జర్నలిస్టులు

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు చిత్తూరు జిల్లా జట్టు

ప్రజాశక్తి- సోమల: రాష్ట్రస్థాయిలో జరిగే టెన్నికాయిట్ పోటీలకు చిత్తూరు జిల్లా జట్టు ఎంపిక అయినట్టు జిల్లా టెన్నికాయిట్ కార్యదర్శి చిన్నప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కందూరులో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి టెన్నికాయిట్ జట్టు ఎంపిక కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి 35 మంది బాలురు, 30 మంది బాలికలు హాజరయ్యారని వీరిలో ఆటతీరు ప్రతిభను గుర్తించిన ఎనిమిది మందిని జిల్లా జట్టుగా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఎంపిక అయిన బాలురు లలిత్ కుమార్, ప్రవీణ్ కుమార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీలేరు, సమీర్, సోహెల్ ముదివేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికలు పల్లవి జడ్పీహెచ్ఎస్ కందూరు, పూజ, గాయత్రి, భానుప్రియ చింతమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎంపిక అయినట్టు ఆయన తెలిపారు. వీరు ఈనెల 11, 12 తేదీలలో శ్రీకాకుళం జిల్లా పలాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

నూతన క్యాలెండర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - సదుం: ప్రజాశక్తి క్యాలెండర్‌ను శనివారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.మారూఫ్ హిస్సేన్ ఆవిష్కరించారు. డిప్యూటి తహశీల్దార్ కుమార్, విలేకరి శ్రీనివాసులు ఉన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని ఎంఈఓ కార్యాలయంలో పిఆర్‌టియు నూతన క్యాలెండర్‌ను శనివారం మండల విద్యాశాఖ అధికారులు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డి ఆవిష్కరించడం జరిగింది. మండల పిఆర్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నకేశవరెడ్డి, పురుషోత్తం, గౌరవ అధ్యక్షులు ఆర్.గంగాధరం, చలపతి, దినకరన్, రమేష్, దేవేంద్ర, చంద్రశేఖర్ శెట్టి, మోహన్ రెడ్డి, డిఆర్ మోహన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పెద్దపంజాణి: ప్రపంచ మేధావి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారతరత్న అవార్డ్ గ్రహీత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ క్యాలెండర్లను శనివారం ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. గంగవరం, పెద్దపంజాణి మండల పరిధిలోని కల్లుపల్లె గ్రామంలో జై భీమ్ యూత్ ఫౌండేషన్ ఛైర్మన్ బి.శంకర్, జిల్లా దళిత నాయకుడు సామాజిక సేవ కార్యకర్త కె.చిన్న, అమర నారాయణ, బాబు పాల్గొన్నారు.

విజయపురం (నగరి): ఎస్‌టీయూ 2025 క్యాలెండర్, డైరీని ఎంఈవో నమశ్శివాయం ఆవిష్కరించారు. శనివారం మండలంలోని గుండ్రాజుకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించి సభ్యులకు అందజేశారు. రాష్ట్ర కౌన్సిలర్ డి.నాగభూషణం నాయుడు, సంఘ సభ్యులు వి.పలని, సి.మోహన్, పి.సింధు, కె. చంద్రయ్య, ఎ.నరసింహులు, డి.మోక్షదాయని, ఎ.జయపాల్, ప్రధానోపాధ్యాయులు జయానందం పాల్గొన్నారు.

చిత్తూరుఅర్బన్ : ఎపిటిఎఫ్ 2025 సంవత్సర నూతన క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖధికారి వరలక్ష్మి శనివారం సాయంత్రం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రానున్న పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో అందరూ సమిష్టిగా కష్టపడి మంచి ఫలితాలు సాదించాలని కోరారు.. జిల్లా అధ్యక్షులు గోపినాథ్, కార్యదర్శి ముక్తార్ అహ్మద్, నాయకులు వేణు, జగదీష్, మధు, పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి..!

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను మండలంలోని రైతులు గ్రామస్తులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ లోకనాథ పిలై కోరారు. శనివారం తహశీల్దార్ ఆధ్వర్యంలో ఉదయం 48 బసివిరెడ్డిపల్లి మధ్యాహ్నం కొటార్లపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి గ్రామస్తుల నుంచి అర్జీలను స్వీకరించినట్లు తెలిపారు. డిటి రవికుమార్, ఆర్.ప్రభాకర్ సర్వేయర్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న భూమి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహించిందని టిడిపి మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని తిమ్మసముద్రం కాలనీలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూహక్కుదారునికి రికార్డుల తప్పులు, ఒకరు భూమి మరొకరిపై నమోదు, భూమి విస్తీర్ణంలో పొరపాట్లను ఈ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చు తహశీల్దార్ బాబు అన్నారు. నేతల సీతాపతి, రామకృష్ణప్ప, మనోహర్, విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురంలో..

శాంతిపురం: మండల పరిధిలోని మోరసనపల్లి పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సును మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల తహశీల్దారు జి.శివయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. తహశీల్దారు జి.శివయ్య మాట్లాడుతూ రైతుల భూమికి సంబంధించిన సమస్యలు అర్జీ రూపంలో తెలిపితే తక్షణం పరిష్కారం చూపుతామన్నారు. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, వీఆర్వో ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి ఏఆర్ స్వాతి, కంప్యూటర్ ఆపరేటర్ అనిల్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE Ist ADDL. JUNIOR CIVIL JUDGE, ANANTHAPURAMU.
O.S.No: 146/2023
Between:
Uco Bank Rep.by its Branch Manager, Raju Road, Ananthapuramu ...**Plaintiff**
And
Mudunuri Arun Kumar and another ...**Defendents**
Notice To Defendant No : 1&2
D1: Mudunuri Arun Kumar S/o Mudunuri Yesuraju, Christian, residing at H.No. 9-4, PN Road, New pet, Chandragiri, Chittoor Dist.
D2: Mudunuri Yesuráju, Christian, residing at H.No. 9-4, PN Road, New pet, Chandragiri, Chittoor Dist.
పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 27/02/2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
T.RAJARAM, Advocate,
Ananthapuramu. Cell No.9440286323